సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
సోమవారం । 4 । మార్చి । 2024



పోలియో రహిత సమాజ స్థాపనకు కృషి

8లో

పోలియో రహిత సమాజ స్థాపనకు కృషి చేస్తున్నట్లు కలెక్టర్ విజయ సునీత అన్నారు.



ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

విశాఖ: ఇస్కాన్ మందిరంలో రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు విగ్రహాలను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

విశాఖ : వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామం జాతరలో కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది.

గెలుపు జెండా ఎగరేద్దాం



అరకువేలీలో నిర్వహించిన సిద్ధం సభలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, వేదికపై మంత్రి అమర్‌నాథ్, ఎమ్మెల్యేలు చెట్టి పాల్గుణ, భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, అరకు సమన్వయకర్త రేగం మత్స్యలింగం తదితరులు

- ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన జగనన్న
- గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుకు ప్రత్యేక కార్యక్రమాలు
- టీడీపీ, జనసేనకు ఓటుతో బుద్ధి చెప్పండి
- వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి
- పాడేరు, అరకులో సిద్ధం సభలు విజయవంతం

పాడేరు : సార్వత్రిక ఎన్నికల్లో పాడేరు, అరకు అసెంబ్లీ, అరకు పార్లమెంట్ స్థానాల్లో విజయం సాధించి జగనన్నకు గిఫ్ట్‌గా ఇద్దామని వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సిద్ధం సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమన్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటిని జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేసి అన్నివర్గాల ప్రజలకు న్యాయం చేశారన్నారు. గిరిజనుల జీవన ప్రమాణాలు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందన్నారు. గిరిజన ప్రాంతంలో విష జ్వరాలు, మరణాలు, డోలీ మోతలు తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుందన్నారు. పాడేరులో రూ.550 కోట్లతో నెలకొల్పుతున్న వైద్య కళాశాల వల్ల గిరిజనులకు మరింత ఉన్నత వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. పరిపాలన సౌలభ్యం కోసం కొత్త జిల్లాల ఏర్పాటుతో గిరిజన ప్రాంతాలు రెండు జిల్లాలుగా ఆవిర్భవించాయన్నారు. గిరిజనులకు అన్నిరకాలుగా మేలు చేసిన ప్రభుత్వానికి మరోసారి అవకాశం కల్పించాలని కోరారు.. రానున్న ఎన్నికల్లో అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో బరిలో నిలిచే వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పని చేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. గతంలో అమలు కాని 600 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేసిన టీడీపీకి, ఆ పార్టీకి మద్దతిస్తున్న జనసేనకు ఓట్లతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

సంస్కరణలతో సమూల మార్పు: అమర్‌నాథ్

రాష్ట్ర ప్రభుత్వం కొత్త సంస్కరణలు చేపట్టి వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చిందని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర డిప్యూటీ రీజనల్ కోఆర్డినేటర్, మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. జగనన్న గిరిజనుల పక్షపాతి అని వారంటే ఆయనకు అమితమైన అభిమానమన్నారు. దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి పుట్టిన రోజు వేడుకలను గిరిజనుల సమక్షంలో జరుపుకున్న సందర్భాలు లేవన్నారు. జగనన్న మాత్రమే గిరిజనుల మధ్య జన్మదిన వేడుకలు జరుపుకున్నారన్నారు. గిరిజన ప్రాంతంలో అన్ని విధాలుగా అభివృద్ధి, సంక్షేమం అమలు చేస్తున్న తమ పార్టీకి మాత్రమే మళ్లీ ఓటు వేయాలని అడిగే హక్కు ఉందన్నారు.

కలిసికట్టుగా పనిచేద్దాం: అరకు ఎంపీ మాధవి

అరకు ఎంపీ గొడ్డేటి మాధవి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో అందరం జగనన్న వర్గంగా మాత్రమే ఉంటూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి అందరం కలిసికట్టుగా పని చేయాలన్నారు. అరకు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చెట్టి ఫాల్గుణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్ 124 సార్లు బటన్ నొక్కి పథకాల సొమ్మును నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండుసార్లు మాత్రమే బటన్ నొక్కి జగనన్న రుణం తీర్చుకోవాలని పిలుపునిచ్చారు. పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ హయాంలో వైద్య కళాశాల, నేషనల్ హైవే వంటి భారీ ప్రాజెక్టులు ఏజెన్సీకి వచ్చాయన్నారు. పాడేరు అసెంబ్లీ సమన్వయకర్త సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ జగనన్న పాలనలో గిరిజనులకు ఎంతో మేలు జరిగిందని భవిష్యత్‌లో మరింత మేలు జరగాలంటే వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, జీసీసీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, మాజీ మంత్రులు పసుపులేటి బాలరాజు, మత్స్యరాస బాలరాజు, నియోజకవర్గ పరిశీలకులు ఫరూఖ్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షురాలు మత్స్యరాస వెంకటలక్ష్మి, నియోజకవర్గంలో ఐదు మండలాల పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి అధిక సంఖ్యలో పార్టీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, గృహ సారథులు, అభిమానులు తరలివచ్చారు.

జగనన్నను మళ్లీ సీఎం చేద్దాం

అనంతగిరి/అరకులోయటౌన్/రూరల్: నిరుపేదలకు పెత్తందారులకు జరుగుతున్న యుద్ధంలో పేదల పక్షాన నిలబడుతున్న జగనన్నను మళ్లీ సీఎం చేద్దామని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. నియోజకవర్గ కేంద్రం అరకువేలీ హరిత రిసార్ట్స్ వద్ద ఆదివారం అరకు అసెంబ్లీ సమన్వయకర్త రేగం మత్సలింగం అధ్యక్షతన నిర్వహించిన సిద్ధం సభ విజయవంతమైంది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, పార్టీ ఉత్తరాంధ్ర డిప్యూటి కోఆర్డినేటర్ గుడివాడ అమర్‌నాథ్‌కు ఘనస్వాగతం లభించింది. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ గతంలో దత్తత తీసుకున్న పెదలబుడు గ్రామాన్ని అభివృద్ధి చేయలేని చంద్రబాబు, రాష్ట్రాన్ని ఏమి అభివృద్ధి చేస్తారని విమర్శించారు. గిరిజనులను టీడీపీ చిన్నచూపు చూస్తే, జగనన్న మాత్రం తన హృదయంలో ఉంచుకున్నారన్నారు. జెండాలు జతకట్టడమే వారి పని అని విమర్శించారు. బాక్సైట్‌కు టీడీపీ అనుకూలంగా జీవోను తెస్తే, గిరిజనులు మనోభావాలు దెబ్బతిన కూడదని వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లో 97 జీవో రద్దుచేసిన ఘనత సీఎందేనన్నారు. పాడేరు కేంద్రంగా అల్లూరి జిల్లా ఏర్పాటు చేసి, గిరిజనులకు వద్దకే పాలన చేరువ చేశారన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలోని 1200 హెక్టార్లలో బాక్సైట్ తవ్వకాలు జరిపేందుకు గత టీడీపీ ప్రభుత్వం అనేక కుట్రలు పన్నిందన్నారు. ఆ సమయంలో ప్రతిపక్షనేత జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనులకు అండగా నిలబడ్డారన్నారు. భీమిలి, దెందులూరు, రాప్తాడు సిద్ధం సభలకు వచ్చిన జనసునామీని చూసి, టీడీపీ నాయకులకు పంచెలు తడిసిపోయాయన్నారు. జగనన్నను ఎదుర్కొనే సత్తాలేకనే పెత్తందారులందరూ ఒక్కటై వస్తున్నారన్నారు. 2024లో జగనన్నను గెలిపించుకునేందుకు ప్రతిఒక్కరు సిద్ధంగా ఉండాలన్నారు. అరకు నియోజకవర్గ పార్టీ శోభ హైమావతి మాట్లాడుతూ అందరం సమన్వయంతో పనిచేసి, పార్టీ అభ్యర్థిని గెలుపించుకుందామన్నారు. అరకు, పాడేరు ఎమ్మెల్యేలు చెట్టి పాల్గుణ,కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో మళ్లీ అరకు ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలను గెలిపించి, జగనన్నకు కానుకగా ఇద్దామన్నారు. ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ గిరిజనులను అత్యున్నత స్థానాల్లో నిలబెట్టిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. సిద్ధం సభ ప్రాంగణంలో గిరిజనుల థింసా నృత్యాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, జీసీసీ చైర్‌పర్సన్ శోభ స్వాతిరాణి, ఎస్టీసెల్ అధ్యక్షురాలు మత్స్యరాస వెంకటలక్ష్మి, మాజీ మంత్రి పి.బాలరాజు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ శోభ సోమేశ్వరి, అరకు జెడ్పీటీసీ శెట్టి రోషిణి, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



పాడేరు: సిద్ధం సభలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుడివాడ అమర్‌నాథ్



అరకులో థింసా నృత్యం చేస్తున్న కళాకారులు





పాడేరు, అరకులో నిర్వహించిన సిద్ధం సభలకు భారీగా హాజరైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు

న్యూస్‌రీల్

చిన్నారులకు పోలియో చుక్కలు తప్పనిసరి: ఎంపీ



కుమార్తెకు చుక్కల మందు వేయిస్తున్న అరకు ఎంపీ మాధవి

కొయ్యూరు: తల్లిదండ్రులు విధిగా పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి కోరారు. ఆదివారం ఆమె స్వగ్రామం శరభన్నపాలెంలో కుమార్తెకు పోలియో చుక్కల మందును వేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలియో చుక్కలు వేయిస్తే వ్యాధి రాకుండా ఉంటుందన్నారు. దేశాన్ని పోలియో రహితంగా చేయడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మండలంలో మొదటిరోజు 97 శాతం విజయవంతం అయిందని రాజేంద్రపాలెం వైద్యాధికారి సంపత్ బాబు, సీహెచ్‌వో ప్రశాంత్ తెలిపారు.

నేడు వ్యూపాయింట్లు ప్రారంభం



చెరువులవేనంలో వ్యూపాయింట్



బోదకొండమ్మ ఆలయం వద్ద వ్యూపాయింట్

చింతపల్లి రూరల్: మండలంలో లంబసింగి చెరువులవేనం, బోదకొండమ్మ తల్లి వ్యూపాయింట్లను సోమవారం ప్రారంభించనున్నట్టు గిరిజన సంక్షేమ శాఖ ఈఈ డీవీఆర్‌ఎం రాజు తెలిపారు. చెరువులవేనం వ్యూపాయింట్‌ను రూ 26.50 లక్షలు, బోదకొండమ్మ తల్లి ఆలయం వద్ద వ్యూపాయింట్‌ను రూ.40 ఎంపీ నిధులతో ప్రభుత్వం నిర్మించింది. పర్యాటకులను ఆకట్టుకునేలా నిర్మించిన వీటిని అరకు ఎంపీ మాధవి, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ప్రారంభిస్తారని ఈఈ పేర్కొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించండి

- జి.మాడుగుల సీఐ రమేష్



నుర్మతి-మద్దిగరువు మార్గంలో తనిఖీ చేస్తున్న డాగ్‌స్క్వాడ్, బాంబ్ డిస్పోజల్ బృందం

జి.మాడుగుల: గిరిజన గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు తక్షణమే ప్రజలు సమాచారం అందించి, శాంతిభద్రత పరిరక్షణకు సహకరించాలని సీఐ రమేష్, ఎస్‌ఐ శ్రీనివాస్ కోరారు. మండలంలో నుర్మతి ఏవోపీ ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్ పోలీసులు ఆదివారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. నుర్మతి-మద్దిగరువు ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్గంలో కల్వర్టులు, బ్రిడ్జిలు, అనుమానిత ప్రాంతాలు, బస్‌షెల్టర్లను డాగ్ స్క్వాడ్, బాంబ్ డిస్పోజల్ బృందాలు క్షుణ్ణంగా తనిఖీ చేశాయి.

పండగలో విషాదం

- గుండెపోటుతో రైతు మృతి



మృతి చెందిన రైతు భూపతిరెడ్డి

రాజవొమ్మంగి: మండలంలోని గింజర్తి గ్రామంలో ఆదివారం జరిగిన రాజుల బాబుల పండగలో విషాదం చోటు చేసుకొంది. అప్పటి వరకు అందరితో సరదాగా గడిపిన అదే గ్రామానికి చెందిన రైతు కొంగర భూపతిరెడ్డి (65) ఉన్నట్టుండి కుప్పకూలి పోయాడు. అతని పరిస్థితిని గమనించిన స్థానిక సర్పంచ్ ఆగూరి శుభలక్ష్మి సమాచారం మేరకు 108 సిబ్బంది వచ్చారు. అప్పటికే భూపతిరెడ్డి మృతి చెందినట్టు వారు ధ్రువీకరించారు. గుండె పోటు వల్లే కుప్పకూలి పోయినట్టు వారు పేర్కొన్నారు. అతని మృతితో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. భూపతిరెడ్డికి భార్య, కుమారుడు ఉన్నారు.

సీఎం వైఎస్ జగన్ పర్యటన ఖరారు

రేపు విశాఖకు రాక



సాక్షి, విశాఖపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 5న విశాఖ నగరానికి రానున్నారు. ఈ మేరకు పర్యటన షెడ్యూల్ అధికారికంగా ఖరారైంది. సీఎం జగన్ గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి ఉదయం 10.30 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.45 గంటలకు మధురవాడ ఐటీ హిల్స్ నం.3 వద్ద గల హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ ప్రజాప్రతినిధులతో ఐదు నిమిషాల పాటు ఇంటరాక్ట్ అవుతారు. అక్కడ నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 11 గంటలకు రాడిసన్ బ్లూ రిసార్ట్‌కు చేరుకుంటారు. గంటన్నర పాటు 'విజన్ విశాఖ' పేరిట వాణిజ్య, వ్యాపారవేత్తలతో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడ నుంచి 12.35 గంటలకు బయలుదేరి పీఎంపాలెం వైజాగ్ కన్వెన్షన్ హాల్‌కు చేరుకుంటారు. అక్కడ »భవిత స్కిల్« డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో పాల్గొంటారు. 1.55 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి మధురవాడ ఐటీ హిల్ నెం.3 దగ్గర హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి 2.30 గంటలకు విమానంలో గన్నవరం ఎయిర్‌పోర్టుకు తిరుగు పయనమవుతారు.

మెరుగైన వైద్యసేవలందించాలి

- కలెక్టర్ విజయ సునీత
- రంపచోడవరం ఏరియా ఆస్పత్రి సందర్శన



రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ సునీత

రంపచోడవరం: స్థానిక ఏరియా ఆస్పత్రిని కలెక్టర్ విజయ సునీత ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డులన్నింటిని పరిశీలించారు. వైద్య సేవలు అందుతున్న తీరుపై రోగులతో మాట్లాడారు. వైద్యులు సక్రమంగా వైద్య సేవలు అందిస్తున్నారా.. ఏమైనా ఇబ్బందులు ఉంటే తనకు చెప్పండని అడిగారు. చిన్న పిల్లల వార్డును సందర్శించారు. అక్కడ అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఆస్పత్రిలో ఉండే రోగులకు, సహాయకులకు అందిస్తున్న భోజనాలు ఎలా ఉంటున్నాయి అని రోగులను నుంచి తెలుసుకున్నారు. రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో వైద్య సేవలపై రోగులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చిన రోగులకు తక్షణ వైద్య సేవలు అందించాలని వైద్యులను సూచించారు. అవసరమైన మందులు ఎప్పకప్పుడు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అనంతరం మారేడుమిల్లి రోడ్డులోని ఏపీఆర్ కళాశాల, పాఠశాలను సందర్శించారు.

చూసిన కనులదే భాగ్యమట!



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



తాళిబొట్టును చూపుతున్న అర్చకులు

- ఘనంగా భద్రాద్రి రాముని కల్యాణం
- రామనామ స్మరణతో మార్మోగిన శ్రీరామగిరి

వీఆర్‌పురం: మండలంలోని శ్రీరామగిరి సుందర సీతారామ చంద్ర స్వామి ఆలయ మండపంలో భద్రాచలం దేవస్థానం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సీతారామచంద్రుల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. పుణ్య గోదావరి,పవిత్ర శబరి నదుల సంగమ ప్రాంతానికి చేరువగా మాతంగ మహారుషి నిర్మించిన ఈ ఆలయంలో సీతారామచంద్రస్వామి వారి కల్యాణం కన్నులపండువగా జరిగింది. భక్తులు తనివితీరా వీక్షించి భక్తి పారవశ్యంతో ఉప్పొంగి పోయారు. సీతారామచంద్రులకు చేతులు జోడించి జేజేలు పలికారు. ఆలయ ప్రధాన అర్చకులు సౌమిత్రి పురుషోత్తమాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సూపరింటెండెంట్ నిరంజన్, ఏఈ స్థల సాయి, శ్రీరామగిరి ఆలయ చైర్మన్ రేవు బాలరాజు, ఈవో జి.లక్ష్మీకుమార్, వేదపండితులు రామకృష్ణప్రసాద్, అర్చకులు విష్ణువర్ధనాచార్యులు, శ్రీకాంతాచార్యులు, రాఘవాచార్యులు, భార్గవాచార్యులు, జూనియర్ అసిస్టెంట్లు వి.సాయిబాబు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఇలావుండగా హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా ప్రత్యేకరథంలో భద్రాద్రి సీతారామ చంద్రస్వామి వార్ల విగ్రహాలతో గ్రామాల్లో పర్యటిస్తూ కల్యాణం నిర్వహిస్తున్నారు. హిందూ ధర్మ ప్రాముఖ్యతను వివరిస్తున్నారు. దీనిలో భాగంగానే ఈ కార్యక్రమం జరిగిందని భద్రాచలం దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి తెలిపారు.

నేడు కృష్ణా కళాశాలలో జాబ్‌మేళా

మద్దిలపాలెం(విశాఖ): డాక్టర్.వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల విద్యా కమిషనర్ డాక్టర్ పోలా భాస్కరరావు తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. డిగ్రీ తృతీయ సంవత్సరం చదవుతున్న విద్యార్థులు, డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగులు ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉదయం 9 గంటల నుంచి మేళా ప్రారంభవుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏం కష్టమొచ్చిందో..

- యువతీ యువకుల బలవన్మరణం
- చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య
- మృతుల వివరాల సేకరణలో నిమగ్నమైన పోలీసులు



చెట్టుకు వేలాడుతున్న మృతదేహాలు

అనంతగిరి: అయ్యో పాపం.. ఏంకష్టమొచ్చిందో తెలియదు కాని యువతీ యువకులు చెట్టుకు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. మండలంలోని బొర్రా పంచాయతీ కటికి రహదారి కరకవలస సమీపంలో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. ఆదివారం సాయంత్రం వీరి మృతదేహాలను పశువుల కాపరులు గుర్తించారు. వెంటనే గ్రామస్తులు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుల వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ప్రాథమికంగా ఇప్పటివరకు వారికి సంబంధించిన ఎటువంటి సమాచారం లభ్యం కాలేదని వారు తెలిపారు. యువతీ యువకులు పర్యాటకులా.. స్థానికులా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

పాపికొండలకు పోటెత్తిన పర్యాటకులు

- నాలుగు బోట్లలో 242 మంది సందర్శకులు

దేవీపట్నం: పాపికొండల పర్యటనకు ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. రాష్ట్ర నలుమూలలకు చెందిన సుమారు 242 మంది ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకున్నారు. వీరంతా రాజమహేంద్రవరం నుంచి వాహనాల్లో పోశమ్మగండి బోట్ పాయింట్‌కు చేరుకున్నారు. నాలుగు బోట్లులో పేరంటాపల్లి, పాపికొండల అందాలు వీక్షించేందుకు తరలివెళ్లారు.

బాలికల ఆశ్రమాల్లో నిఘా నేత్రం



అనంతగిరి బాలికల ఆశ్రమ పాఠశాల-2లో ఏర్పాటుచేసిన సీసీ కెమెరా



హెచ్‌ఎం గదిలో ఏర్పాటుచేసిన స్క్రీన్

జిల్లావ్యాప్తంగా 49 చోట్ల సీసీ కెమెరాల ఏర్పాటు

అనంతగిరి: ఆశ్రమ పాఠశాలల్లో బాలికల రక్షణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. జిల్లాలోని బాలికల ఆశ్రమ పాఠశాలలను నాడు-నేడు పథకంలో అత్యాధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేసిన ప్రభుత్వం వారి పరిరక్షణకు పటిష్ట మైన చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా 49 గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసింది. ముఖద్వారం, ప్రహరీ, వసతి గృహం, తరగతి గదులు కన్పించేలా ఒక్కొక్క పాఠశాలలో పదింటిని అమర్చారు. వీటికి సంబంధించి హెచ్‌ం గదిలో స్క్రీన్, స్టోరేజీ సిస్టమ్‌ను ఏర్పాటుచేశారు. కలెక్టర్, పాడేరు ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు వీటిని ఏర్పాటుచేసినట్టు ఆశ్రమ అధికారవర్గాలు పేర్కొన్నాయి.

నిరంతరం పర్యవేక్షణ

పాఠశాల చుట్టూ సీసీ కెమెరాలు ఉన్నాయి. పాఠశాలను మరింత పర్యవేక్షించేందుకు సీసీ కెమెరాలు ఉపయోగపడుతున్నాయి. పాఠశాల పని నిమిత్తం బయటకు వెళ్లినా మొబైల్ ద్వారా పర్యవేక్షించేందుకు అవకాశం ఉంది.

– రాజ్యలక్ష్మి, మేట్రిన్, అనంతగిరి బాలికల ఆశ్రమ పాఠశాల-2

బాలికల రక్షణకు ఉపయోగం

ఆశ్రమ పాఠశాలల్లో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల వల్ల బాలికలకు మరింత రక్షణ ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా సీసీ కెమెరాల వ్యవస్థను అందుబాటులోకి తెచ్చాం. దీనివల్ల అనునిత్యం పర్యవేక్షణకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి,

– కొండలరావు, డిప్యూటీ డైరెక్టర్, గిరిజన సంక్షేమశాఖ, పాడేరు

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు




ప్రమాదంలో గాయపడిన నాని, రాజ్‌కుమార్

పెదబయలు: మండలంలోని అడుగులపుట్టు గ్రామ సమీపంలో మలుపు వద్ద ద్విచక్ర వాహనం ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించే క్రమంలో బైక్ స్కిడ్ అవడంతో ఇద్దరి యువకులకు తీవ్రగాయాలయ్యాయి. అడుగులపుట్టు పంచాయతీ కోడాపుట్టు గ్రామానికి చెందిన కుర్తాడి నాని, అరడకోట గ్రామానికి చెందిన కూడ రాజ్‌కుమార్ అరడకోట వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కుర్తాడి నాని తలకు తీవ్రగాయమైంది. రాజ్‌కుమార్‌కు ముఖం ఇతర భాగాల్లో గాయాలయ్యాయి. ఇద్దరికి హుటాహుటిన పెదబయలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో 108 అంబులెన్స్‌లో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ద్విచక్ర వాహనం మలుపు వద్ద వేగంగా రావడం వల్ల ప్రమాదం జరిగినట్టు స్థానికులు తెలిపారు. ఈ విషయంపై పెదబయలు ఎస్‌ఐ మనోజ్‌కుమార్ కేసు నమోదు చేశామని తెలిపారు.

అంతర్‌జిల్లాల కబడ్డీ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక



ఎంపికైన కబడ్డీ జట్టు

గాజువాక: నెల్లూరులో ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు జరగనున్న 70వ అంతర్ జిల్లాల కబడ్డీ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే జిల్లా జట్టును ఆదివారం ఎంపిక చేశారు. గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఎంపిక పోటీల్లో 18 మంది క్రీడాకారులతో జట్టును సిద్ధం చేశారు. ఎంపికైన వారికి నగరంలోని పోర్టు గ్రౌండ్‌లో మూడు రోజుల పాటు శిక్షణనిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి వి.రాజేశ్వరి, ప్రతినిధి పి.కోటేశ్వర రావు తెలిపారు. ఈ జట్టుకు అంతర్జాతీయ కోచ్ ఉమా శంకర్‌బాబు శిక్షణ ఇస్తారన్నారు. ఎంపిక పోటీలను జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు పి.దాసు, గణపతి, ఉమ, ప్రకాష్, సత్యం, సత్యనారాయణ, శివ, రమణ, బ్రహ్మాజీ, కాశీ ప్రసాద్ పర్యవేక్షించారు.

పోలియో రహిత సమాజ స్థాపనకు కృషి

- కలెక్టర్ విజయ సునీత
- 1,20,722 మందికి చుక్కల మందు
- విజయవంతంగా పల్స్‌పోలియో



చిన్నారికి పోలియో చుక్క వేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర



చింతలవీధి సబ్‌సెంటర్‌లో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న కలెక్టర్ విజయ సునీత



దుంబ్రిగుడలో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



హుకుంపేటలో పోలియో చుక్కలు వేస్తున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

సాక్షి,పాడేరు: పోలియో రహిత సమాజ స్థాపనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ ఎం.విజయ సునీత అన్నారు. చింతలవీధి సబ్‌సెంటర్‌లో ఆమె చిన్నారులకు చుక్కల మందు వేసి పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్ల లోపు పిల్లలందరికీ తల్లిదండ్రులు పోలియో చుక్కల మందును వేయించాలని సూచించారు. మిగిలిన చిన్నారులను సోమవారం వైద్యసిబ్బంది వారి ఇళ్లకు వెళ్లి చుక్కలమందు వేస్తారన్నారు. పాత పాడేరులో చిన్నారికి పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ చుక్కల మందు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లాలోని 22 మండలాల పరిధిలో 1,23,673 మందికి చుక్కల మందు వేయాలన్న లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటివరకు 1,20,722 మందికి వేసినట్టు డీఎంహెచ్‌వో జమాల్‌బాషా తెలిపారు.

అరకులోయటౌన్/డుంబ్రిగుడ: చిన్నారులు ఆరోగ్యానికి రెండు చుక్కలు అవసరమని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. ఐదేళ్లలోపు ఉన్న చిన్నారులకు తప్పనసరిగా పోలియో చుక్కల మందు వేయాలని ఆయన సూచించారు. మండల కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఐదేళ్లలోపు చిన్నారులకు పల్స్‌పోలియో చుక్కలను వేశారు. గన్నెల పీహెచ్‌సీ పరిధిలోని 3681 చిన్నారులకు, మాడగడ పీహెచ్‌సీ పరిధిలోని 3775 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్టు అధికారులు చెప్పారు.

పోలియో మహమ్మారిని రెండు చుక్కలతో తరిమేద్దాం

ముంచంగిపుట్టు: పోలియో మహమ్మారిని రెండు చుక్కలతో పిల్లల నుంచి తరిమేద్దామని విశాఖ ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీ చైర్ పర్సన్ పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. మండలంలో అన్ని గ్రామాల్లో ఐదేళ్ల వయస్సు లోపు ఉన్న పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని వైద్యాధికారులను, సిబ్బంది సూచించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ నిండు జీవితానికి రెండు చుక్కలు వేయాలని, తల్లిదండ్రులు పోలియో చుక్కలు వేయించడంలో నిర్లక్ష్యం చేయవద్దన్నారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని ఆమె సూచించారు. వైద్యాధికారులు రమేష్, శిరీష, ప్రతాప్, శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: మండల కేంద్రంలో డీఎంహెచ్‌వో జమాల్‌బాషా స్థానిక వైద్యాధికారులతో కలిసి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలన్నారు. వైద్యాధికారి డాక్టర్ గాయత్రి, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- మెనూ పక్కాగా అమలు చేయండి
- ఐటీడీఏ పీవో అభిషేక్



కందమామిడి ఆశ్రమ పాఠశాలలో బాలికలకు భోజనాన్ని వడ్డిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న పీవో అభిషేక్

సాక్షి, పాడేరు: రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మెనూను పక్కాగా గిరిజన ఆశ్రమ పాఠశాలలు, ఇతర విద్యాలయాల్లో అమలుజేసి, గిరిజన విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందజేయాలని పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఆదేశించారు. మండలంలోని కందమామిడి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆయన ఆదివారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటగదిని సందర్శించి బాలికలకు వండుతున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. మెనూ ప్రకారం సిద్ధం చేసిన వంటకాలను చూసి ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. బిర్యానీ, ఇతర ఆహార పదార్థాలను పీవో స్వయంగా బాలికలకు వడ్డించారు. పిల్లలతో ఆయన మమేకమయ్యారు. మెనూను కచ్చితంగా అమలు జేయాలని, విద్యార్థినుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. చిన్నపాటి అనారోగ్య సమస్యలు తలెత్తితే సకాలంలో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించి సత్వరమే వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. అనంతరం టెన్త్ విద్యార్థినులకు సైన్స్ పాఠ్యాంశాలను పీవో అభిషేక్ బోధించారు. పాఠశాలలో విద్యా కార్యక్రమాల అమలుపైన పీవో సంతోషం వ్యక్తం చేశారు.ఈ ఏడాది టెన్త్‌లో నూరుశాతం ఫలితాలు సాధించాలన్నారు. బాల్య వివాహాలను వ్యతిరేకించాలని, వాటి వల్ల కలిగే అనర్థాలను తల్లిదండ్రులు, గ్రామస్తులకు తెలియజేయాలని సూచించారు. విద్యతోనే సమాజ ప్రగతి సాధ్యమవుతుందన్నారు. విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలు ఏర్పాటుచేసుకొని తదనుగుణంగా కష్టపడి లక్ష్యాన్ని అధిగమించాలన్నారు.

విద్యార్థినులు ఉన్నత విద్య అభ్యసించి, ఉన్నత భవిష్యత్‌కు చేరుకోవాలని ఆకాంక్షించారు. డ్రాపౌట్ విద్యార్థులు పాఠశాలల్లో చేర్పించేలా ఉపాధ్యాయులు చూడాలన్నారు. చిన్నారుల బంగారు భవిష్యత్ లక్ష్యంగా తల్లిదండ్రులు తమ పిల్లల చదువులకు సహకరించాలని కోరారు. ఆయన వెంట హెచ్‌ఎం వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

రాజ్యసభ సభ్యులు సుబ్బారెడ్డి, ఇన్‌చార్జి మంత్రి అమర్‌నాథ్‌లకు సన్మానం



రాజ్యసభ సభ్యులు వై.వి.సుబ్బారెడ్డిని సన్మానించిన అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, అనురాధ దంపతులు



రాజ్యసభ సభ్యులు సుబ్బారెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అమర్‌నాథ్‌లతో ఎమ్మెల్యే పాల్గుణ, కుటుంబీకులు

సాక్షి,పాడేరు: రాజ్యసభ సభ్యులు, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, డిప్యూటీ రీజినల్ కో–ఆర్డినేటర్ గుడివాడ అమర్‌నాథ్‌లకు అరకు ఎమ్మెల్యే, జిల్లా పార్టీ అధ్యక్షుడు చెట్టి పాల్గుణ కుటుంబం ఆదివారం ఘనంగా సన్మానించింది. పాడేరులో వైఎస్సార్‌సీపీ సమావేశానికి హాజరైన వారు పాడేరులోని అరకు ఎమ్మెల్యే స్వగృహానికి చేరుకున్నారు. వారికి దుశ్శాలువాలు కప్పి ఆత్మీయంగా సత్కరించారు. ఎమ్మెల్యే సతీమణి అనురాధ, వైఎస్సార్‌సీపీ యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్, డాక్టర్ తనుజారాణి దంపతులు, అడ్డుమండ, రూడకోట సర్పంచ్‌లు గుమ్మా శ్యాంసుందర్, సురేష్, జిల్లా సాంస్కృతిక విభాగ అధ్యక్షుడు దిలీప్‌కుమార్ తదితరులున్నారు.

నా సాహితీ ప్రయాణానికి నాంది విశాఖలోనే...

సినీ గీతాల రచయిత సుద్దాల అశోక్ తేజ



సినీ గీత రచయిత సుద్దాల అశోక్ తేజ, నిర్మల దంపతులను సత్కరిస్తున్న డాక్టర్ కిరణ్ ప్రభు, డాక్టర్ రఘురామారావు

సీతంపేట: విశాఖతో మంచి అనుబంధం ఉందని, తన సాహితీ ప్రయాణానికి నాంది పలికింది విశాఖలోనే అని ప్రముఖ సినీగేయ రచయిత సుద్దాల అశోక్ తేజ అన్నారు. విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో డాక్టర్ సుద్దాల అశోక్ తేజ మాట,పాట కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తన జీవన ప్రయాణంలోని పలు అంశాలను ప్రేక్షకులతో ఆయన పంచుకున్నారు. తెలంగాణాలోని ఒక మారుమూల పల్లె టూరులో జన్మించానని, తన తల్లి,తండ్రి పాటలతో తెలంగాణ రైతాంగ పోరాటంలో ప్రజలను చైతన్యం చేశారన్నారు. తల్లి, భార్య ప్రోత్సాహంతో సినీరంగంలో అడుగుపెట్టి 30 సంవత్సరాల ప్రయాణాన్ని కొనసాగించానని తెలిపారు. పాట రాస్తూనే జీవితాన్ని ముగించాలని ఉందన్నారు. ముఖ్యఅతిథి డాక్టర్ కిరణ్ ప్రభు కౌముది మాట్లాడుతూ విలక్షణ రచయిత సుద్దాల అశోక తేజకు జరుగుతున్న సన్మానం తెలుగు పాటకు, ప్రజా గీతానికి జరుగుతున్న సత్కారమన్నారు. అనంతరం అశోక్‌తేజ, నిర్మల దంపతులను సత్కరించి జ్ఞాపిక బహూకరించారు. సుద్దాల అశోక్ తేజ రాసిన పాటలను ఈ సందర్భంగా ఎస్.ఎస్.ఆర్. నవీన్ బృందం ఆలపించి అలరించింది. విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపకులు డాక్టర్ జి.రఘురామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ ఈదర పెద వీర్రాజు, ఆచార్య ప్రయాగ సుబ్రహ్మణ్యం, పలువురు రచయితలు,కవులు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

ఎంత మంది జతకట్టినా.. గెలిచేది సీఎం జగనే..

మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్



సీతంపేట: ఎంత మంది జతకట్టినా.. గెలిచేది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే అని మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఆదివారం బుల్లయ్య కళాశాల స్వర్ణోత్సవంలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడారు. పేద, మధ్య తరగతి ప్రజలందరూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పక్షానే ఉన్నారన్నారు. బలమైన నాయకుడిగా ఉన్న సీఎం జగన్‌ను ఎదుర్కోలేక టీడీపీ, జనసేన కూటమిగా ఏర్పడ్డాయన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసిన ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌న అని కొనియాడారు. సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శకమైన పాలనకు శ్రీకారం చుట్టారన్నారు. మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకునేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు.

గిరిజన యువకుడు దారుణ హత్య

- మద్యం మత్తులో హతమార్చిన సాధువు
- కత్తితో దాడి చేయడంతో సంఘటన స్థలంలోనే మృతి



దాడికి ఉపయోగించిన కత్తి




హత్యకు గురైన బలరాం మృతదేహం, హంతకుడు సాధువు మోహన్

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో స్థానిక అంబేడ్కర్ పార్కు సమీపంలో ఆదివారం సాయంత్రం గిరిజన యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. హత్యకు పాల్పడిన వ్యక్తి సాధువు కావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఈ సంఘటనకు సంబంధించిన ఎస్‌ఐ రవీంద్ర కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని జర్జుల పంచాయతీ సంతవీధి గ్రామానికి చెందిన బలరాం (27) పాలపిండి అమ్మకం నిమిత్తం ఆదివారం మధ్యాహ్నం ఇంటి నుంచి ముంచంగిపుట్టు వచ్చాడు. అంబేడ్కర్ పార్కు సమీపంలో నివాసం ఉంటున్న జమున ఇంటి వెళ్లాడు. అదే ప్రాంతంలో కర్ణాటక రాష్ట్రం ఉడిపి తాలూక అంబల్పాడి గ్రామానికి చెందిన సాధువు మోహన్ పూజారి పూటుగా మద్యం సేవించి పడుకుని ఉన్నాడు. అక్కడికి వచ్చిన బలరాం అతని వద్ద డబ్బులను బలవంతంగా లాక్కొని ఖర్చు పెట్టేశాడు. కాసేపు పోయిన తరువాత మళ్లీ సాధువు వద్దకు వెళ్లి డబ్బులు తీసుకునేందుకు ప్రయత్నించాడు. దీంతో వారిద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. సాధువు తన వద్ద ఉన్న కత్తితో బలరాంపై దాడి చేశాడు. మెడ, కడుపు భాగంలో పొడవడంతో తీవ్ర రక్త స్రావంతో బలరాం అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు వెంటనే సాధువును పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన ఎస్‌ఐ రవీంద్ర సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. సాధువును అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. పోలీసుల సమాచారం మేరకు మృతుని కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి వచ్చారు. మృతదేహం వద్ద బోరున విలపించారు. మృతుడి అన్న వంతాల జగన్నాథం ఫిర్యాదు మేరకు హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

విశ్వహిందీ పరిషత్ జాతీయ అధ్యక్షునిగా యార్లగడ్డ

- పదవీకాలం రెండేళ్లు



ఏయూక్యాంపస్: విశ్వహిందీ పరిషత్ జాతీయ అధ్యక్షునిగా రాజ్యసభ పూర్వ సభ్యులు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ నియమితులయ్యారు. రెండేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. ఆదివారం ఉదయం ఏయూ హిందీ విభాగంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ వివరాలు వెల్లడించారు. ఐక్యరాజ్య సమితిలో హిందీని అధికార భాషగా చేయడం లక్ష్యంగా తాను పనిచేస్తాన న్నారు. ప్రపంచ వ్యాప్తంగా హిందీ వినియోగం, ప్రపంచ దేశాలలో భారతీయ సంస్కృతిని హిందీ భాష ద్వారా వ్యాప్తి చేయడానికి ఈ సంస్థ పనిచేస్తుందన్నారు. ప్రాంతీయ భాషలతో సమన్వయం చేసి హిందీ శబ్దశక్తిని పెంచడం, తద్వారా భాషా పరంగా జాతీయ సమైక్యతను సాధించడం సంస్థ ప్రధాన లక్ష్యమన్నారు. ఈ లక్ష్యాలను నెరవేర్చడానికి సుదీర్ఘ కాలంగా హిందీయేతర ప్రాంతీయుడినైనా హిందీ, తెలుగు భాషల వ్యాప్తికి కృషిచేస్తున్న తనను గుర్తించి జాతీయ అధ్యక్షునిగా నియమించారని చెప్పారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా పర్యటించి వివిధ దేశాల్లో ఈ సంస్థ లక్ష్యాలను విజయవంతంగా నిర్వహిస్తామని చెప్పారు.

బుల్లయ్య కళాశాలకు స్వర్ణోత్సవ శోభ



మొదటి బ్యాచ్ విద్యార్థులతో అతిథులు, కళాశాల యాజమాన్యం



సినీనటుడు శుభలేఖ సుధాకర్‌ను సన్మానిస్తున్న దృశ్యం



గోల్డెన్ జూబ్లీ హాల్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

సీతంపేట: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల స్వర్ణోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. కళాశాల అధ్యక్షుడు కె.సి.రెడ్డి అధ్యక్షతన ఆదివారం సాయంత్రం జయభారత్ ప్రాంగణం వేదికగా ఈ వేడుకలు సందడిగా సాగాయి. వ్యవస్థాపక అధ్యక్షుడు, అప్పటి విశాఖ జిల్లా కలెక్టర్ కె.జయభారత్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ఈ వేడుకలను ప్రారంభించారు. కళాశాల మొదటి బ్యాచ్ లెక్చరర్స్, విద్యార్థులు, ప్రస్తుత బ్యాచ్ విద్యార్థులు సందడి చేశారు. అప్పటి జిల్లా కలెక్టర్ కె.జయభారత్‌రెడ్డి మాట్లాడుతూ తన ఆధ్వర్యంలో ఒక్క బీకామ్ కోర్సుతో ఏర్పాటైన కళాశాల 50 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో విజయాలను అందుకుందన్నారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ జి.మధు కుమార్ మాట్లాడుతూ విద్యతో పాటు, క్రీడలు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, స్కౌట్స్ అండ్ గైడ్స్ వంటి ఫిజికల్ యాక్టివిటీతో విద్యార్థులు ఎప్పుడూ ఫిట్‌గా ఉండేలా తీర్చిదిద్దుతున్నట్టు తెలిపారు. గత ఐదు దశాబ్దాలలో కళాశాల సాధించిన ప్రగతి, మైలు రాళ్లను వివరించారు. కళాశాల పూర్వ విద్యార్థి ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ కళాశాల స్వర్ణోత్సవాలలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం కళాశాల వ్యవస్థాపక అధ్యక్షుడు జయభారత్‌రెడ్డిని, బీవీఆర్ మోహన్‌రెడ్డిని, పూర్వ విద్యార్థులు ధర్మాన కృష్ణదాస్, జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు, సినీనటుడు శుభలేఖ సుధాకర్, కళాశాల మొదటి బ్యాచ్ అధ్యాపకులను, మొదటి మూడు బ్యాచ్‌ల విద్యార్థులను సత్కరించారు. గోల్డెన్ జూబ్లీ హాల్‌ను జయభారత్‌రెడ్డి ప్రారంభించారు. ఐఏఎస్ అజయ్‌కల్లాం, మొదటి బ్యాచ్ అధ్యాపకులు కె.సత్యనారాయణ, రియాజ్ మహమ్మద్, ఎస్.ఇందిర, పురుషోత్తం, వి.కల్యాణ రామారావు పాల్గొన్నారు.